రంజాన్ వేళలు
ఇఫ్తార్ - గురువారం
సాయంత్రం - 6:35
సహర్ - శుక్రవారం
ఉదయం - 4:46

అక్కడ వలవల



సూర్య ప్రతాపానికి పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు వడ్డీలకు తెచ్చిన సాగు చేసిన పంటలు నీళ్లు లేక వాడుతున్నాయి. ఎండ వేడిమికి భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు, వ్యవసాయ బావులు ఎండిపోయాయి. చుక్క నీరు కూడా లేకుండా పోయింది. దీంతో రైతులు చేతికొచ్చే దశలో కళ్లెదుటే పంటంతా ఎండిపోతుండడంతో విలవిల్లాడుతున్నారు. వాటిని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎక్కడో కొద్దిపాటి నీరు లభిస్తున్న ప్రాంతాల నుంచి నీటిని కొని ట్యాంకర్ల ద్వారా తరలించి పంటలకు ప్రాణం పోస్తున్నారు. యాచారం మండలం చౌదర్‌పల్లిలో ఓ రైతు మూడెకరాల్లో టమాట వేశాడు. తన పొలంలో వేసిన బోరు 25 రోజుల క్రితం ఎండిపోయింది. దీంతో టమాట పంటను కాపాడుకునేందుకు రైతుకు ట్యాంకర్లే దిక్కయ్యాయి. ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.వెయ్యి చొప్పున వెచ్చించి టమాట తోటకు నీరు పెడుతున్నాడు. ఇప్పటికి పది ట్యాంకర్ల నీటిని వాడినట్లు రైతు యాదయ్య చెప్పాడు. మరో పది టాంకర్ల నీటిని వాడితే తప్ప పంటంతా చేతికందదని వాపోయాడు. ఇంత దారుణ పరిస్థితులు తామేనాడు చూడలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

- యాచారం, ఏప్రిల్ 3

ఇక్కడ కళకళ



ఎండలు మండిపోతున్నాయి. భానుడి ఉగ్ర రూపానికి మనుషులే కాదు పంటలు కూడా మలమల మాడిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీళ్లు ఎండిపోయాయి. దీంతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో చేతికందే దశలో ఉన్న పంటలు నీరందక మాడుతున్నాయి. దీంతో ఆ పంటలు పశువుల మేతగా వాడుతున్నారు. ఇవీ జిల్లాలోని మెజారిటీ ప్రాంతాల్లో కనిపించే దృశ్యాలు. కానీ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఓ ప్రాంతంలో వరి పొలాలు కనుచూపు మేరలో పచ్చగా కనిపిస్తున్నాయి. చూసే వారికి కనువిందు చేస్తున్నాయి. యాచారం మండలం నానక్‌నగర్ గ్రామంలో ఈ సుందర మనోహర దృశ్యం సాక్షాత్కరిస్తోంది. తాటపర్తి-నానక్‌నగర్ గ్రామాల మధ్య ఉన్న చెరువులో టిక్కీ లెవల్ వరకు నీరుండడంతో చెరువు ఆయకట్టు కింద బోర్లు పుష్కలంగా నీరందిస్తున్నాయి. దీనికి తోడు పెద్ద చెరువులో కూడా నీరు సమృద్ధిగా ఉంది. దీంతో ఈ రెండు చెరువుల కింద 48 మంది రైతులు 70 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఈ పంటలకు రెండు చెరువుల నీరు పుష్కలంగా లభిస్తుండడంతో వాటికింద సాగుచేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

ఇక్కడ స్పీడ్.. అక్కడ బ్రేక్!

ఊపందుకున్న పాత హైవే పనులు.. నిలిచిన రైల్వే బ్రిడ్జి నిర్మాణం



కొనసాగుతున్న పాత జాతీయ రహదారి పనులు

షాద్‌నగర్ పట్టణం, సమీప గ్రామాల వారిని ఏళ్లుగా పీడిస్తున్న సమస్యలు ముఖ్యంగా పాత జాతీయ రహదారి విస్తరణ పనులు, అలాగే చటాన్‌పల్లి రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం. పాత జాతీయ రహదారిని కొత్తూను నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు విస్తరణ పూర్తి చేశారు. అక్కడి నుంచి సోలీపూర్ వై జంక్షన్ వరకు చేపట్టాల్సిన పనులు మాత్రం నిలిచాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రస్తుతం ఈ పనుల్లో వేగం పెరిగింది. అయితే చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద తలపెట్టిన ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మాత్రం అవాంతరాలు ఎదురవుతున్నాయి. పనులెప్పుడు పూర్తవుతాయా? తమకు రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందా? అని వాహనదారులు, స్థానికులు ఎదురు చూస్తున్నారు.

- పాత హైవే పనులతో ప్రజల హర్షం
- డిజైన్ మార్పులతో నిలిచిన రైల్వే బ్రిడ్జి నిర్మాణం
- స్థల సేకరణ చేసి నిధులు విడుదలైతేనే పనుల ప్రారంభం
- రోజూ రైల్వే గేటు వద్ద వాహనదారుల ఇబ్బందులు
- బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్



స్థల సేకరణ సాధ్యమేనా?

రైల్వే బ్రిడ్జి డిజైన్‌లో మార్పు చేస్తే మరింత స్థల సేకరణ చేపటాల్సి ఉంటుంది. కానీ స్థలం ఇవ్వడానికి స్థానికులు అంగీకరిస్తారా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డిజైన్ మారిస్తే అంచనా వ్యయం కూడా పెరుగుతుంది. నిర్మాణానికే కాకుండా భూ సేకరణకు కోట్లలో నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ఇదంతా కార్యారూపం దాల్చేందుకు ఎంతలేదన్నా ఏడాదిపైనే సమయం పడుతుందని నిపుణులు అంటున్నారు. అప్పటి వరకు పరస్థితి ఇలాగే కొనసాగితే చటాన్‌పల్లి రహదారి మరో పాత జాతీయ రహదారిలా మారక తప్పదని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యకం చేశారు.

షాద్‌నగర్, ఏప్రిల్ 3 : రవాణా వ్యవస్థకు సంబంధించి ఇన్నాళ్లుగా షాద్‌నగర్ పట్టణాన్ని, నియోజకవర్గ ప్రజలను పట్టి పీడిస్తున్న రెండు ప్రధాన సమస్యల్లో ఒక దానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండోది అర్ధంతరంగా నిలిచిపోయి అయోమయ పరిస్థితి నెలకొంది. షాద్‌నగర్ మునిసిపాలిటీలో నెలకొన్న పరిస్థితి ఇది. మొదటి సమస్య పాత జాతీయ రహదారి కాగా, రెండోది చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం. కొన్నేళ్లుగా వాహనదారులు, పట్టణ ప్రజలు ఈ సమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్నారు. ఈ రెండు సమస్యలు తీరకపోవడం.. పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు హైవే నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండడంతో త్వరలోనే సమస్య తీరుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఈ దారి రహదారి!

కొత్తూరు నుంచి సోలీపూర్ బైపాస్ వై జంక్షన్ వరకు ఉన్న పాత జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించి రూ.67.18 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో కొత్తూరు నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు రోడ్డు పనులు వేగంగానే పూర్తయ్యాయి. అయితే షాద్‌నగర్ ప్రధాన కూడలి నుంచి సోలీపూర్ వై జంక్షన్ వరకు జరగాల్సిన రోడ్డు విస్తరణ పనులకు నిధుల విడుదల కాలేదని కాంట్రాక్టర్ పనులను చేయలేదు. దీంతో సగం పనులతో రోడ్డంతా గుంతలమయమై కనీసం నడుచుకుంటూ అయినా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వానకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉండేది. గుంతల్లో ఎక్కడికక్కడ నీరు నిండి రోడ్డు మీద కాదు బురదలో నడుస్తున్నట్టుగా పరిస్థితి ఉండేది. వాహనాలు గుంతల్లో కూరుకుపోయేవి. గోతుల్లో కనీసం మొరం పోయడం, బీటీ లేచిన చోట ప్యాచ్ వర్క్‌లు కూడా చేయకుండా వదిలేయడంతో వాహనదారులు, ప్రజలు నానాపాట్లు పడేవారు. ఈ రోడ్డు గురించి ఇటు హైవే, అటు ఆర్‌అండ్‌బీ అధికారులు ఎవరూ పట్టించుకో లేదు. ఇదిలా ఉంటే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా గెలిచాక నిధులు మంజూరు చేయించి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే చటాన్‌పల్లిలోని రైల్వే బ్రిడ్జి నిర్మాణం విషయంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. రైల్వే శాఖ ఆధీనంలోని పనులు కావడంతో ఈ పనులు ఇంతలో అయ్యేలా కన్పించడం లేదు. రైల్వే శాఖ అధికారులు, ప్రభుత్వాలు తలుచుకుంటేనే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి అవుతాయి.

పనులు నిలిచి ఇబ్బందులు రెట్టింపయ్యాయి

రైల్వే బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీటీ రోడ్డు లేకుండా పోయి పూర్తిగా మట్టిరోడ్డే కావడంతో భారీగా దుమ్ము, ధూళి లేచి ఆరోగ్యం దెబ్బతింటోంది. ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే రైల్వే గేట్ వద్ద నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య తీరుతుందని సంతోషించాం. కానీ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. పాత రోడ్డు కూడా ఇరుగ్గా మారింది. అధికారులు పనులను వేగవంతంగా పూర్తిచేసి రైల్వే బ్రిడ్జి సమస్యను తీర్చాలి.



సలీం, చటాన్‌పల్లి

అడ్డం తిరిగిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.97.5కోట్లు మంజూరయ్యాయి. పనులకు అప్పటి రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. తర్వాత బ్రిడ్జి మీద సింగిల్ రూట్ పనులు కూడా పనులు మొదలయ్యాయి. కానీ ఈ బ్రిడ్జి మీదుగా వాహనాలు రెండు వైపులా పోయేందుకు అనువుగా లేదని, డిజైన్‌లో మార్పు చేయాలని భావించి పనులను నిలిపివేశారు. దీంతో సమస్య మరింత జటిలమైంది. ఎందుకంటే నాలుగు రోడ్లు కలిసే రైల్వే గేటు మీదుగా పెద్దఎత్తున వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో బ్రిడ్జి నిర్మాణం పనులు నిలిచి నాలుగు డైరెక్షన్లలో రోడ్లు కుచించుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తరచూ ఇక్కడ ట్రాఫిక్ స్తంభిస్తోంది. గేటు పడ్డప్పుడూ ఇబ్బందులు తప్పడం లేదు. బ్రిడ్జి డిజైన్ మార్పు కోసం ప్రతిపాదనలు పంపినట్లు రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు. మరి మార్పులపై రైల్వే శాఖ ఎప్పుడు ఆమోదం తెలపాలి? ఆ మేరకు ఎస్టిమేషన్లు ఎప్పుడు వేయాలి? నిధులు ఎప్పుడు విదల్చి పనులు చేస్తారో ఆ దేవుడికే తెలియాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. అత్యంత ప్రాధాన్యం, అవసరం ఉన్న ఈ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు పరిస్థితిని గమనించి వెంటనే పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

అండర్ పాస్ ఏమైనట్టు?

నాలుగు రహదారుల కూడలి అయిన చటాన్‌పల్లి వద్ద వెలిజర్ల వైపునకు మాత్రమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కానీ చటాన్‌పల్లి, జహంగీర్‌పీర్ దర్గా వైపు వాహనాలు వెళ్లేందుకు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు అప్పట్లో ప్రతిపాదించారు. అయితే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ఆ ప్రాంతంలో కొన్ని ఇళ్లను తొలగించే పరిస్థితి ఉండటంతో కాలనీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భూమి ఇవ్వం అన్నారు. దీంతో అండర్‌పాస్ నిర్మాణ ప్రతిపాదన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపైనా దృష్టి పెట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- తుక్కుగూడ జనజాతర సభ ఏర్పాట్ల పరిశీలన

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : తుక్కుగూడ సెంటిమెంట్‌తో ఇక్కడి నుంచే ఆరు గ్యారంటీలకు శ్రీకారం చుట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇక్కడి నుంచే 5 గ్యారంటీలకు శ్రీకారం చుట్టేందుకు సమయం ఆసన్నమైందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెల 6న జరగబోయే జనజాతర బహిరంగ సభ ఏర్పాట్లను ఆయనతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన దేశ ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేశామన్నారు. 75రోజులు గడవక ముందే ఇందిరమ్మ పథకాన్ని తెచ్చామన్నారు. ప్రజలు మరోసారి దీవించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. జనజాతర సభకు లక్షలాదిగా పార్టీ శ్రేణులు తరలిరానున్నట్లు చెప్పారు. పార్టీ అధినేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు వస్తున్న ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశ నేతలు తుక్కుగూడకు మరోసారి రానున్నట్లు, 5 గ్యారంటీలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుడతారని, అందుకు తనకు సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, దెబ్బడగూడ మాజీసర్పంచ్ శ్రావణి, కూన యాదయ్య, పీసీసీ సెక్రటరీ జనకిరాం, కాకి ఈశ్వర్, ఇ.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మరో మంత్రి శ్రీధర్‌బాబు, నాయకులు

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోదాంలో రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్‌ను పూర్తిచేశారు. ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే జిల్లాలోని ఎల్బీనగర్, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు కంట్రోల్/బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు కేటాయించామన్నారు. స్ట్రాంగ్ రూముల్లో మిషన్లను భద్రపరుస్తామన్నారు. ఎల్బీనగర్‌కు 713బీయూ/సీయూలు, 799 వీవీప్యాట్లు, మహేశ్వరానికి 671 బీయూ/సీయూలు, 751 వీవీ ప్యాట్లు, రాజేంద్రనగర్‌కు 678 బీయూ/సీయూలు, 760 వీవీప్యాట్లు, శేరిలింగంపల్లికి 791బీయూ/సీయూలు, 886 వీవీ ప్యాట్లు, చేవెళ్లకు 372 బీయూ/సీయూలు, 471 వీవీప్యాట్లు, షాద్‌నగర్‌కు 328 బీయూ/సీయూలు,379 వివిప్యాట్లు, కల్వకుర్తికి 338 బీయూ/సీయూలు, 379 వీవీప్యాట్లు, ఇబ్రహీంపట్నంకు 428 బీయూ/సీయూలు, 480 వీవీప్యాట్లను కేటాయించామన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదను కలెక్టర్ ప్రతిమాసింగ్, రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నీటి ఎద్దటిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సరిపడా ఉందన్నారు. ప్రణాళికతతో సరఫరా చేసేలా చూడాలన్నారు. చేతి పంపులు మరమ్మతులు చేయించి, అవసరమైతే వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకుని తాగునీటిని అందించాలని తెలిపారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలపై తెలియజేయాలన్నారు. ఉదయమే పనులు పూర్తిచేసుకుని మధ్యాహ్నం బయటకురావొద్దన్నారు. ఉపాధి పనులనూ ఉదయమే చేయించాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి సమస్య వడదెబ్బ కేసులుంటే టోల్‌ఫ్రీ నంబరు 9347492260కు కాల్ లేదా వాట్సాప్‌తో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీలత పాల్గొన్నారు.



ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రేగడిఘనపూర్ మాజీసర్పంచ్‌లు

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

చేవెళ్ల, ఏప్రిల్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాల అభివృద్ధికి పెద్ద పీటవేస్తున్నామని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, నర్సింలు, మాజీ ఉపసర్పంచ్‌లు బాల్‌రెడ్డి, యాదయ్య కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన బీంభరత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రంజిత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రేగడిఘనాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం కోసం, రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రఘురాంరెడ్డి

ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 3 : ధైర్యానికి, ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ అని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి ధర్మ పరిరక్షణకు పాటుపడాలని చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు సీఎస్. రంగరాజన్ అన్నారు. ఆయన హిందూ ధర్మాన్ని చాటిన మహనీయుడని కొనియాడారు. బుధవారం ఛత్రపతి శివాజీ వర్ధంతి సంర్భంగా మండల పరిధిలోని చిలుకూరు దేవాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం రంగరాజన్ మాట్లాడుతూ శివాజీ మరాఠా యోధుడు అని, భారతీయులకు స్ఫూర్తిప్రధాత అని చెప్పారు. ఆయన ఆడుగు జాడల్లో ప్రతీ ఒక్కరు నడిచి హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని సీఎస్. రంగరాజన్ కోరారు. కార్యక్రమంలో పవన్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాశింబౌలి గ్రామంలో చత్రపతి విగ్రహానికి మాజీ ఉపసర్పంచ్ రఘురాంరెడ్డి గ్రామస్థులతో కలిసి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

కొనసాగుతున్న నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 3 : మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో శ్రీ గణపతి, ఈశ్వర, నవగ్రహ, నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండోరోజు అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం ఫల, పుష్ప, ధాన్య శయ్యాధివాసం, హోమాన్ని మంత్రోచ్ఛరణల మధ్య వేదపండితుల నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ స్వర్ణలతసతీష్, గ్రామస్థులు సంజీవరెడ్డి, ఆర్. మహేందర్‌రెడ్డి, నర్సింహులు, విష్ణువర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న గ్రామస్థులు

మరో వివాదంలో మాజీ మంత్రి మల్లారెడ్డి

హరితహారం మొక్కలు నరికేసి కాలేజీ భవనాల నిర్మాణం

» తప్పుడు ఆరోపణలు చేసిన మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువునష్టం దావా » మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్



హరితహారం మొక్కల స్థానంలో నిర్మించిన కళాశాల భవనం



మాట్లాడుతున్న ఈశ్వర్

మేడ్చల్ ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మరో వివాదంలో నిలిచారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారాన్ని అపహాస్యం చేయడమే కాకుండా నాటిన వేల మొక్కలను తొలగించి కాలేజీ భవనాలు నిర్మించాడని స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ ఈశ్వర్, గ్రామస్తులు గడిల కృష్ణారెడ్డి, ముద్రగణం సంపత్, గోపాల్,సాయికుమార్ తదితరులు బుధవారం కాలేజీ ఆవరణలో నాటిన మొక్కలను తొలగించి నిర్మించిన కాలేజీ భవనాలను మీడియా ప్రతినిధులకు చూపించిన అనంతరం మాట్లాడారు. 2016-18లో మూడేళ్ల పాటు ఉమెన్స్ కాలేజీ ఆవరణలోని మైదానంలో అప్పటి మంత్రి కేటీఆర్, కలెక్టర్, సీఎంవో అధికారి ప్రియాంకవర్గీస్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టి దాదాపు 10 వేల మంది విద్యార్థినులతో 32వేల మొక్కలు నాటించినట్లు తెలిపారు. తదనంతరం నాటిన మొక్కలను తొలగించి అదే స్థలంలో పెద్దపెద్ద కాలేజీ భవనాలను నిర్మించారని వారు ఆరోపించారు. హరితహారం మొక్కలపై అప్పటి ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు చేపట్టిందని వేల మొక్కలను తొలగించిన మల్లారెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున కాలేజీ భవనాలను నిర్మించారని వారు ఆరోపించారు. మల్లారెడ్డి సంస్థలపై, భూఆక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. చెరువులు, కుంటల సమీపంలో భూములు కొనుగోలు చేస్తూ క్రమక్రమంగా వాటిని ఆక్రమించే వారని వారు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.

రూ. 20 కోట్ల పరువునష్టం దావా..

కాగా తనపై తప్పుడు ఆరోపణలు చేసిన మాజీ మంత్రి మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువునష్టం దావా వేయనున్నట్లు మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్ తెలిపారు. తనకు డబ్బులు ఇచ్చినట్లు మాజీ మంత్రి మల్లారెడ్డి చేస్తున్న దుష్ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. దమ్ముంటే మల్లారెడ్డి తనకు డబ్బులు ఇచ్చినట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కల్గించేలా ఆరోపణలు చేసిన మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువునష్టం దావా వేయనున్నట్లు ఆయన తెలిపారు.

విహారయాత్రకు ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్లు

» 'అవిశ్వాసం' ఫిర్యాదుతో చైర్‌పర్సన్ అప్రమత్తం



ఘట్‌కేసర్, ఏప్రిల్ 3 : ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్‌పై పెట్టిన అవిశ్వాసం కొత్త మలుపు తిరిగింది. మున్సిపాలిటీలో మొత్తం 18 మంది కౌన్సిలర్లున్నారు. ఇందులో బీఆర్ఎస్ 11 మంది (చైర్ పర్సన్‌తో కలిపి) కాంగ్రెస్ 6, స్వతంత్రుడు ఒకరు. ఇందులో బీఆర్ఎస్ 10, ఇద్దరు కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు మొత్తం 12 మంది కలిసి ఇటీవల చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అవిశ్వాసానికి 13మంది కౌన్సిలర్లు అవసరం కాగా, ఉన్న 12మందికి తోడు ఒకరిని కలుపుకునే ప్రయత్నంలో ఉండగానే.. ఉన్నట్టుండి చైర్‌పర్సన్ 7మంది సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. కాంగ్రెస్‌కు చెందిన నలుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు, చైర్ పర్సన్‌తో కలిసి మొత్తం ఏడుగురు మంగళవారం సాయంత్రం టూర్‌కు వెళ్లారు. అవిశ్వాసంపై అధికారులు తేదీ ఖరారు చేయనప్పటికీ.. ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఎలాగైనా చైర్‌పర్సన్ పదవి నుంచి దించేయాలని సొంత పార్టీవారే ఇతర పార్టీ వారితో కలిసి చేసిన ప్రయత్నం నీరుగారి పోవడంతో ఏం చేయాలో తెలియక బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు లబోదిబోమంటున్నారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా అవిశ్వాసం ఎత్తును చిత్తు చేస్తూ చైర్‌పర్సన్ పావని తీసుకున్న నిర్ణయంతో బీఆర్ఎస్‌లోని మెజార్టీ కౌన్సిలర్లు సొంత పార్టీ కౌన్సిలర్లను కాపాడుకోవడంలో విఫలయ్యారని జోరుగా చర్చ జరుగుతోంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పలు దేవాలయాలను దర్శించుకొని బుధవారం రాత్రి బెంగుళూరుకు చేరుకున్నట్లు సమాచారం. పదవిని కాపాడుకునే ప్రయత్నంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. చైర్ పర్సన్ పావని యాదవ్ తనకు అవసరమైన బలంతో అజ్ఞాతంలోకి వెళ్లడంతో చేసేదేమీ లేక బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. చైర్ పర్సన్ పావని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అయినందున అవిశ్వాసం పెడితే పార్టీకి చెడ్డపేరు వస్తుందని కేటీఆర్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి సూచించినట్లు వివరించారు. పార్టీ అధిష్ఠానం సూచన మేరకు అవిశ్వాసాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. ఇదిలాఉంటే, ఈ ప్రకటనపై సోషల్‌మీడియాలో చైర్‌పర్సన్ ఎత్తుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చిత్తయ్యి చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని కామెంట్లు చేశారు. ఇంతప్రేమ ఉంటే.. అవిశ్వాసం కోరుతూ ఫిర్యాదు ఎందుకు చేశారు? అనే కామెంట్లూ వినిపిస్తున్నాయి. అవిశ్వాసాన్ని చిత్తు చేసేందుకు వెళ్లిన చైర్‌పర్సన్ వర్గం తేదీ ప్రకటించేవరకు బయటే ఉంటారా! లేక వచ్చి ఓటింగ్‌కు దూరంగా ఉంటారా అనేది వేచి చూడాల్సిందే.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో మంటలు

» సీజ్ చేసిన వాహనాల వద్ద అంటుకున్న చెత్త

» మంటలార్పిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3 : ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో పాత వాహనాలను పార్కు చేసిన ప్రదేశంలో బుధవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే మంటలను ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. పోలీసుస్టేషన్ వెనకాల సీజ్ చేసిన వాహనాలతో పాటు ఇతర సామగ్రి స్టోర్ చేశారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో చెత్తకు మంటలు అంటుకున్నాయి. దాంతో గతంలో ఎప్పుడో సీజ్ చేసిన పటాకులపై నిప్పురవ్వలు పడటంతో మంటలు చెలరేగి భారీ శబ్దాలతో వచ్చాయి. పోలీసులు వెంటనే మంటలార్పే యత్నం చేశారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. చెత్తకుప్పపై నిప్పురవ్వలు పడి పక్కనే ఉన్న పటాకులపై పడటంతో మంటలు చెలరేగి, భారీ శబ్దం వచ్చిందని పోలీసులు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలకు స్వల్పంగా మంటలు తాకినట్లు చెప్పారు. ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తెచ్చామని, ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదని తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా సిగరెట్ తాగి పడేయడం వల్ల మంటలు చెలరేగాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

» చెంగోల్ వేంకటేశ్వరాలయంలో

» నేటితో ముగియనున్న జాతర

తాండూరు రూరల్, ఏప్రిల్ 3 : మండల పరిధిలోని చెంగోల్‌లో శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం నూతన విగ్రహాలకు అభిషేకం, నిత్య పూర్ణాహుతి, మంగళశాసనము, చతుస్థాన అర్చన, మూలమంత్రహరణం, శయ్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఇంద్రసేనారెడ్డి, ఉమాదేవి, కృష్ణయ్య, వడ్డె విజయలక్ష్మి, బావనోళ్ల పద్మమ్మ, నర్సింహులు, నీలమ్మ, హన్మయ్య, రాజేశ్వరి, సురేష్‌కుమార్ దంపతులు హోమంలో కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కిషోర్‌పంతులు ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. నేడు(గురువారం) శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, పులేందర్, వెంకటేశం, రాము, శేఖర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, జయంత్, పండరయ్య, రాకేష్‌గౌడ్‌తోపాటు కమిటటీ సభ్యులు, వివేకానంద, చత్రపతి యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దంపతులు

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలి

» జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 3 : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రబీ వరి ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లింగ్యా నాయక్ మాట్లాడారు. 2023-24 యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే 8 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరణకు సంసిద్ధమవుతున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎవరైనా పొరపాటు చేసినట్లు మా దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 122 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కావలసిన సౌకర్యాలు తూకం మిషన్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ మీటర్లు, ప్యాడీ క్లీనర్స్, లైటింగ్ తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఈ సంవత్సరం యాసంగిలో వ్యవసాయ శాఖ అంచనా మేరకు లక్షా 93 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి రావొచ్చని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను లోతట్టు ప్రాంతాల్లో కాకుండా, ఎత్తయిన ప్రదేశాల్లో వర్షపు నీరు నిలవకుండా, రవాణాకు సౌకర్యవంతంగా ఉండే స్థలాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని రైతుల సౌకర్యార్థం టెంట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వరి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్-ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణభాయి, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీఆర్డీవో శ్రీనివాస్, డీసీవో ఈశ్వరయ్య, డీఎంసీఎస్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీటీలు, ట్రాన్స్‌పోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు పన్నులు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

నార్సింగ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు పన్నులు సకాలంలో చెల్లించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు సంయుక్తంగా 3,143 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించగా.. 3,067 కోట్లు సాధించామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. గత సంవత్సరం ఆదాయంతో పోలిస్తే 9.9 శాతం వృద్ధి రేటు సాధించామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా 1,689 కోట్లు, మేడ్చల్-మల్కాజ్‌గిరి 1,298 కోట్లు, వికారాబాద్ 80 కోట్లు కలిపి 3,067 కోట్లు ఆదాయం సాధించడం జరిగిందన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. 2024-2025లో సైతం ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఆర్టీవోలు రఘునందన్, సుభాష్‌చందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రైలెక్కిన 'కొండా'

» ప్రయాణికులతో కబుర్లు.. సమస్యలపై ఆరా

» సామాన్య ప్రయాణికుడిలా జనరల్ బోగీలో ప్రయాణం



రైల్లో ప్రయాణికులతో ముచ్చటిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 3: తాండూరు ప్రాంతంలో జరుగుతున్న ప్రజా ఆశీర్వాద యాత్రలో ఒకరోజు విరామం తీసుకున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి మంగళవారం హైదరాబాద్ పయనమయ్యారు. గతుకుల రోడ్లతో విసిగిపోయిన కొండా.. సామాన్య ప్రయాణికుడిగా రైలు జనరల్ బోగిలో వెళ్లారు. ఈ సందర్భంగా తాండూరు రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ చేపట్టిన పనులకు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ క్లాస్ ఏసీ బోగిలో ప్రయాణించేందుకు సకల సౌకర్యాలు ఉన్నా కూడా.. సామాన్య వ్యక్తిలా ప్రయాణికులతో కలిసిపోయారు. బోగీలో ఉన్నవారిని పలకరించి.. సమస్యలు అడిగి తెలుసుకుంటూ రైలులో ప్రయాణించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ అభ్యర్థి రవియాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 3 : వేసవి నేపథ్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల ప్రతీఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ముస్లింలు ఉపవాస దీక్షలో ఉండటంతో బయట ఎక్కువగా తిరిగే ప్రయత్నం చేయరాదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్‌లోని మధు కాలనీకి సంబంధించిన మదర్సా, మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కిషన్ నాయక్, సుధాకర్ రెడ్డి, వహీద్ మియా, మహిపాల్ రెడ్డి, రమేష్, మౌలానా అలిముద్దీయిన్, కరీం, సర్ఫరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, రఘుపతి రెడ్డి, వెంకట్‌రెడ్డి, పారశురాం నాయక్, అసిఫ్, ఉస్మాన్, మాక్బూల్, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో మార్చిలో 27 కస్టమ్స్ కేసులు

శంషాబాద్, ఏప్రిల్ 3: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 2024 మార్చిలో 27 కస్టమ్స్ కేసులు నమోదు చేశామని ఆ శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ దేశాల నుంచి శంషాబాద్‌కు వచ్చిన ప్రయాణికుల వద్ద అక్రమంగా తెచ్చిన 12కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.



తాండూరు : మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి

» పీవో, ఏపీవోలకు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచన

కొడంగల్, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీవో, ఏపీవోలు ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. ఈమేరకు బుధవారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్, కొడంగల్ మండలాలకు చెందిన పీవో, ఏపీవోలకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వచ్చే ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఆయన సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. తహసీల్దార్లు బి.విజయ్‌కుమార్, సి.విజయ్‌కుమార్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పారదర్శకంగా పని చేయాలి

తాండూరు : అధికారులు పారదర్శకంగా పని చేయాలని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించబోయే ప్రిసైడింగ్ అధికారులకు సహాయ ప్రిసిడింగ్ అధికారులకు ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని తాండూరు ప్రభుత్వ నెంబర్ వన్ పాఠశాలలో నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు పారదర్శకతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. ఏమైన సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్ల వద్ద నివృత్తి చేసుకోవాలని కోరారు. 300 పోలింగ్ సిబ్బందిగాను 257 మంది సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. హాజరుకాని వారు గురువారం శిక్షణకు హాజరుకాకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. తహసీల్దార్లు తారాసింగ్, కిషన్, వెంకటేష్, మునీరుద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన మిషన్ భగీరథ అధికారులు



పైపులైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, ఏప్రిల్ 3 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఆదేశించడంతో మిషన్ భగీరథ డీఈ సందీప్, ఏఈ హరి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజుతో కలిసి పలు గ్రామాలను సందర్శించారు. బుధవారం మండలంలోని కాస్లాబాద్, ఎదిర, ముష్టిపల్లి, చింతకుంటతండా, గాలిగూడ, మల్కాపహాడ్, ధర్మతండాలో పర్యటించి నీటి సమస్య, వివరాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అక్కడక్కడ పైపులైన్ మరమ్మతులు చేయాల్సి ఉందని వారు గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేసి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని వారు గ్రామస్థులకు సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి

యాచారం, మార్చి 3 : మండల కేంద్రంలోని రైతు భవన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ రైతులకు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని దళారీలకు విక్రయించకుండా రైతుభవన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని రైతులకు సూచించారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బి గ్రేడ్ రకానికి రూ. 2,183 ప్రభుత్వం ధర చెల్లిస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యంతో పాటు ధరణి పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు ఇవ్వాలని చెప్పారు. ఫోన్ నెంబర్ కూడా నమోదు చేసుకోవాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న వైస్‌ప్రిన్సిపాల్ శ్రీలత

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 3 : సంపూర్ణ ఆరోగ్యం కోసం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత చెప్పారు. ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వేసవి ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగిన సేవా కార్యక్రమాల్లో గ్రామస్థులు తమ విద్యార్థినులతో కలిసి పాల్గొనడం సంతోషకరమని అన్నారు. ఇక్కడ తమ విద్యార్థినులు ఎంతో నేర్చుకున్నారని చెప్పారు. వారు చేపట్టిన కార్యక్రమాలు గ్రామస్థులకు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి, అధ్యాపకురాలు శ్రీలక్ష్మీ, గ్రామస్థులు కృష్ణ, శ్రీను, రాజశేఖర్, ఆనంద్ ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్, ఏప్రిల్ 3 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చిన్నతనం నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకొని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సీఐ శివప్రసాద్ సూచించారు. భవిష్యత్తుకు ప్రాథమిక విద్య పునాది లాంటిదని ఆయన చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఐ శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, ఏమైన సమస్యలు ఎదురైతే తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. క్రమశిక్షణ, ఏకాగ్రతతో ముందుకు సాగే విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బిను, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘం కమిటీ ఎన్నిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 3 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యువజన సంఘం ఆమనగల్లు మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో సంఘం నాయకులు సమావేశమై సమస్యలపై చర్చించారు. అనంతరం గౌడ సంఘం మండల అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్, ఉపాధ్యక్షుడు గంగ రవీందర్‌గౌడ్, ఆమనగల్లు మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండ్రాతి నరేశ్‌గౌడ్, గౌరవాధ్యక్షుడిగా గుండ్రాతి కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గజ్జె రాఘవేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను సంఘం నాయకులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు దూసకంటి యాదయ్య, వెంకటయ్య, పరమేశ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపు జ్వాల దొడ్డి కొమురయ్య

షాబాద్, ఏప్రిల్ 3 : తెలంగాణ చైతన్యపు జ్వాల దొడ్డి కొమురయ్య అని, నేటితరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూర్ పాండు అన్నారు. బుధవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా షాబాద్‌లో ఆ సంఘం నాయకులతో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలన, దొరల పెత్తందారి విధానానికి వ్యతిరేకంగా కొమురయ్య పోరాటాలు చేశారన్నారు. సంఘం నాయకులు నరేందర్, మల్లేష్, నర్సిహులు, కృష్ణ, సుదర్శన్, నారాయణ పాల్గొన్నారు.

చేవెళ్ల : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దామని చేవెళ్ల ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి అన్నారు. బుధవారం కొమురయ్య జయంతి సందర్భంగా



షాబాద్ : నివాళులర్పిస్తున్న నాయకులు



చేవెళ్లలో కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, తదితరులు

పట్టణ కేంద్రంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు కొమురయ్య అని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండాల రాములు, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు సదానందం, కురుమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు బుర్ల సాయినాథ్, శ్రీనివాస్, నర్సింలు, మల్లేశ్, దండు సత్యనారాయణ, మహేశ్, వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింలు, మల్లేష్, ఉన్నారు.

కందుకూరు : తెలంగాణలో వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమురయ్యను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కురుమ సంఘం నేత ఎగ్గిడి సత్తయ్య కోరారు. బుధవారం కొమురయ్య జయంతిని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడు కొమురయ్య అని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం కురుమ సంఘం నేతలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ముచ్చర్ల ఎంపీటీసీ మల్లేష్, గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, నాయకులు మల్లేష్, శ్రీను. ఓగ్గిడి జగదీశ్వర్‌కురుమ, అచ్చన పాండు, అనిల్, శ్రీనివాస్, కిష్టయ్య, శివ, సాయికిరణ్, శివకుమార్, మహేష్, పాల్గొన్నారు.



కందుకూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

జనజాతర సభతో సత్తా చాటాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 3 : జనజాతర సభతో సత్తా చాటి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో పనిచేసి మరో మారు కాంగ్రెస్‌కు తెలంగాణ కంచుకోట అని నిరూపించాలని ఆయన కోరారు. తుక్కుగూడలో ఈనెల 6న (రేపు) నిర్వహించబోయే జన జాతర బహిరంగసభ విజయవంతం కోసం బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి హాజరై మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బాగంగా తుక్కుగూడలో నిర్వహించే బహిరంగ సభలో ఏఐసీసీ మ్యానిఫెస్టోను ప్రకటించబోతున్నట్లు తెలిపారు. దేశ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా మ్యానిఫెస్టో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, పాల్గొనే సభను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. కల్వకుర్తి నుంచి సభకు 50 వేల మందిని తరలిస్తామని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, ప్రభాకర్ రెడ్డి, కిషన్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కేశవులు, కృష్ణనాయక్, బాల్‌రామ్, ఖాదర్, ఉన్నారు.

శివాజీకి ఘన నివాళి



శివాజీకి నివాళులర్పిస్తున్న యూత్ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 3 : శివాజీ వర్ధంతి సందర్భంగా కందుకూరు గ్రామంలో నవభారత్ యూత్ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆ సంఘం అధ్యక్షుడు మీగడి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎడ్ల ఉదయ్‌కిరణ్, ముఖేష్, ప్రశాంత్, జంగయ్య పాల్గొన్నారు.

మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్

చేవెళ్ల, ఏప్రిల్ 3 : మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని మహాజన సోషలిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాస్వారం శంకర్‌రావుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగళ్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సీఎం రేవంత్‌రెడ్డి తన సీటును కాపాడుకోవడం కోసం మాదిగలకు అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణలో ఐదు శాతం జనాభా ఉన్న రెడ్డిలకు ఆరు సీట్లు కేటాయించుకున్న సీఎం 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్‌మాదిగ, చేవెళ్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, మల్లేల శివప్రసాద్, నాయకులు శ్రీనివాస్, బానుప్రసాద్, మహేందర్, వెంకటేశ్, గణేశ్, ఉన్నారు.



చేవెళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలి : ఎమ్మార్పీఎస్



షాద్‌నగర్ : నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్‌అర్బన్ : లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా అవమానపర్చిన కాంగ్రెస్ పార్టీకి మాదిగ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి. నర్సింహ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీలకు రిజర్వు చేసిన మూడు ఎంపీ స్థానాల్లో ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీల్లో 20శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు, తక్కువ సంఖ్యలో ఉన్న బైండ్లకు ఒక సీటిచ్చి, 70శాతం ఉన్న మాదిగలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని అన్నారు. సి. అశోక్‌మాదిగ, ఎన్. మహేందర్‌మాదిగ, పి. యాదయ్యమాదిగ, టి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ దంపతులు

చేవెళ్ల, ఏప్రిల్ 3 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కొండకల్ మాజీ సర్పంచ్ గొరిగ వీరయ్య, మాజీ ఎంపీటీసీ గుత్తి తాండ్రయ్య అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో మల్లన్న, బీరప్ప, కొండపోచమ్మ దేవాలయాల భూమి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు అని చెప్పారు. టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, కాశీనాథ్, దేవుల నాయక్, అశోక్‌నాయక్, గుత్తి బాబు, వెంకన్న, మైపాల్, రామచంద్రయ్య, అశోక్, రామలక్ష్మయ్య గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

భరోసా కల్పించేందుకే తుక్కుగూడ సభ

షాద్‌నగర్, ఏప్రిల్ 4 : దేశంలోని అణగారిన వర్గాల ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆధ్వర్యంలో తుక్కుగూడలో ఈనెల 6న జనజాతర సభను నిర్వహించబోతున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా పార్టీ అగ్రనేత సోనియాగాంధీ సమక్షంలో ఆరు గ్యారెంటీల మ్యానిఫెస్టోను విడుదల చేసి అమలు చేస్తున్న ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. అదే తరహాలో తమ అగ్రనేతలు లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను 6న జరుగబోయే సభలో విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి 15వేల మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలను సభకు తరలించనున్నట్లు చెప్పారు. బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమం కోసం మరిన్ని పథకాలను కాంగ్రెస్ ప్రవేశపెట్టనుందని, ఆ వివరాలను జనజాతర సభలో పార్టీ అధినేతలు ప్రకటిస్తారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను తెలంగాణ గడ్డ మీద విడుదల చేయడం హర్షణీయమన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, బాలరాజుగౌడ్, చెంది తిరుపతిరెడ్డి, కె చెన్నయ్య, బసవప్ప, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వీర్లపల్లి

విద్యార్థినికి అస్వస్థత

● ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి : బాలిక తండ్రి

తాండూరు రూరల్, ఏప్రిల్ 3 : తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా, తన బిడ్డకు జరిగిన అన్యాయం ఏ బిడ్డకూ జరగరాదని బాలిక తండ్రి ఆసుపత్రి నుంచి వీడియో తీసి మీడియాకు చేరవేశాడు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్‌రావుతండాకు చెందిన రాములు నాయక్‌కు ఇద్దరు ఆడపిల్లలు అమృత, లోకేశ్వరి. వీరిని తాండూరు మండలం జినుగుర్తి గేటు సమీపంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలలో చదివిస్తున్నాడు. అమృత 9వ తరగతి, లోకేశ్వరి 7వ తరగతి అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. గత నెల 26వ తేదీన అమృత ఆరోగ్యం బాగోలేదని వాంతులు, విరేచనాలు అవుతున్నట్లు హాస్టల్ నిర్వాహకులు తండ్రి రాములు నాయక్‌కు సమాచారం అందించారు. అప్పటికే అమృత తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది. రాములు అంబులెన్స్‌లో వికారాబాద్ మహవీర్ ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అమృత బాడీ ఇన్ఫెక్షన్‌కు గురైందని పరిస్థితి బాగోలేదని చెప్పారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లే స్తోమత లేదని, ఇక్కడే వైద్యం అందించాలని రాములు వైద్యులను కోరాడు. ప్రస్తుతం అమృత కోలుకుంటోంది. వసతి గృహం నిర్వాహకులు, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తండ్రి రాములు వీడియోలో పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ పార్వతమ్మను వివరణ కోరగా, విద్యార్థిని అమృత అస్వస్థకు గురైంది వాస్తవమేనని తెలిపారు. అమృత పరిశుభ్రతను పాటించదని, అందుకే అస్వస్థతకు గురై ఉండవచ్చని పేర్కొన్నారు. తనకు వాంతులు, విరేచనాలు అవుతున్న విషయాన్ని కూడా చెప్పలేదన్నారు.

రోడ్డు మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలు

● సూచికలు ఏర్పాటు చేయని అధికారులు ● ప్రమాదాల బారిన వాహనదారులు



పెంజర్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మలుపు

కొత్తూర్, ఏప్రిల్ 3 : కొత్తూర్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్లు నిర్మించారే తప్ప మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సిద్ధాపూర్, కొత్తూర్-జేపీ దర్గా, తిమ్మాపూర్-గుడూర్ గ్రామాల రోడ్లకు ప్రమాదకర మలుపులు(డేంజర్ కర్వ్‌లు) ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికొచ్చే వరకూ కన్పించడం లేదు. దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రాత్రి పూట ద్విచక్రవాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెంజర్ల, ఇన్ముల్‌నర్వ సమీపంలో రోడ్డు మలుపుల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇన్ముల్‌నర్వ సమీపంలో జహంగీర్‌పీర్ దర్గా ఉండడంతో ఇక్కడ వాహనాల రద్దీ ఉంటుంది. దీంతో యాక్సిడెంట్లు, బైక్‌లు స్కిడ్ అవడం వంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు మలుపుల వద్ద అధికారులు స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్ బోర్డులు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నాలా ధ్వంసంపై ఆర్డీవోకు ఫిర్యాదు

శంషాబాద్, ఏప్రిల్ 3 : శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఫిరంగి నాలాను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని గ్రామస్థులు బుధవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని కాలువను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు నీరటి మల్లేష్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, రమేష్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, ఏప్రిల్ 3 : మాదాయిపల్లి గ్రామానికి చెందిన బాలనాగమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 3 వేలు ఆర్థిక సాయం చేశారు.

క్రైం కార్నర్

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి, ఏప్రిల్ 3 : మద్యానికి బానిసై, భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో జరిగింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం పడకల్ గ్రామానికి చెందిన బొల్లం రమేశ్(43) కొంత కాలంగా మద్యానికి బానిసై తన భార్యతో రోజు గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈనెల 1న రమేశ్ తన భార్యతో గొడవ పడగా ఆమె పుట్టింటికి వెళ్లింది. ఆ రోజు నుంచి రమేశ్ ఒక్కడే ఇంట్లో ఉండేవాడు. కాగా రెండు రోజుల నుంచి రమేశ్ ఇంటి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు తెరచి చూడగా అతను ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. వారు అతని భార్య రాణమ్మ, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎస్సై విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

చేవెళ్ల, ఏప్రిల్ 3 : విధినిర్వహణలో ఉన్న ఎస్సైని కొట్టడానికి ప్రయత్నించి, ఆయన విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం ఓ కేసు విషయంలో చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఎస్సై వీరబ్రహ్మం తన క్యాబిన్‌లో ఓ ఫిర్యాదుదారుడు జుట్టు కుమార్‌తో మాట్లాడుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన అనంతయ్య అతని సోదరుడు సురేష్ ఆకస్మికంగా, అనుమతి లేకుండా ఎస్సై క్యాబిన్‌లోకి వచ్చారు. ఎందుకు వచ్చావురా అని జుట్టు కుమార్‌ను బెదిరించారు. ఎస్సై వీరబ్రహ్మం కుమార్‌ను ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించాడు. వారు ఎస్సై వీరబ్రహ్మం పైకి చేయి చూపిస్తూ మీరేంది మమ్మల్ని అడిగేది అంటూ ఆయనపైకి వెళ్లారు. అది గమనించి వెంటనే స్టేషన్‌లో ఉన్న కానిస్టేబుల్ దయాకర్, బాలసుబ్రమణ్యం వారిని అడ్డుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న ఎస్సై విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు స్పష్టం చేశారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి



మృతుడు

మహేశ్వరం, ఏప్రిల్ 3 : ఆర్టీసీ మహేశ్వరం డిపోలో పని చేస్తున్న ఓ ప్రయివేటు డ్రైవర్ మద్యం మత్తులో మురికి నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలిలా ఉన్నాయి. కందుకూరు మండలం దన్నారం గ్రామానికి చెందిన గోపాల్‌దాస్ గణేష్(28) అనే వ్యక్తి మహేశ్వరం ఆర్టీసీ డిపోలో ప్రయివేటు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా బుధవారం ఉదయం డిపో నుంచి బయటకు వచ్చిన గణేష్ మండల కేంద్రంలోని ఓ మురికి నీటి గుంతలో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిందర్ తెలిపారు.

బాలిక కిడ్నాప్ ఘటనలో ఇద్దరిపై పోక్సో కేసు

కులకచర్ల, ఏప్రిల్ 3: బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కులకచర్ల పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక మార్చి 29న పరీక్షకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కటుంబ సభ్యులు ఆచూకీ కోసం తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మార్చి 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు బాలిక కిడ్నాప్‌కు గురైనట్లు గుర్తించి, మండలంలోని సాల్విడ్ గ్రామానికి చెందిన గోపాల్, అతనికి సహకరించిన పాలమూర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన రామకృష్ణను అరెస్టు చేసి పోక్సో చట్టం కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అన్వేష‌రెడ్డి తెలిపారు. బాలికను వికారాబాద్ సఖి కేంద్రానికి తరలించినట్లు వారు తెలిపారు.

ఆస్థి పంపకంలో న్యాయం చేయాలని ధర్నా

యాచారం, ఏప్రిల్ 3 : ఆస్థి పంపకంలో న్యాయం చేయాలని యాదగిరి అనే వ్యక్తి తన భార్య సునితతో కలిసి తన తండ్రి ఇంటి ముందు ధర్నాకు దిగిన ఘటన యాచారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. బాధితుడు చెప్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పంబలి సత్తయ్య అనే వ్యక్తికి యాదగిరి, వెంకటయ్య, అండాలు సంతానం, కాగా యాదగిరిని అతని చిన్నతనంలోనే వారి బంధువులు దత్తత తీసుకున్నారు. అనంతరం తిరిగి యాదగిరి తమ ఇంటికి వచ్చాడు. కాగా అన్నదమ్ములందరూ కలసి తమ సోదరి అండాలు వివాహం చేశామని యాదగిరి వాపోయారు. తన తండ్రి సత్తయ్య సంపాదించిన ఇల్లు, భూమిలో తనకు వాటా ఇవ్వాలని కోరుతూ యాచారం పోలీసులను ఆశ్రయించానన్నారు. న్యాయం జరగక పోవడంతోనే తన ఇంటి ముందు ధర్నాకు దిగానని చెప్పారు. తన తండ్రి వస్తేనే న్యాయం జరుగుతుందని యాదగిరి చెప్పాడు. కాగా ధర్నా విషయం తెలుసుకున్న యాచారం పోలీసులు గ్రామానికి చేరుకునా దర్యాప్తు చేపట్టారు. భూ పంపకంలో తనకు న్యాయం చేయాలని యాదగిరి కోర్టులో కేసు వేసినట్లు సమాచారం.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



షాపును తనిఖీ చేస్తున్న గీతారెడ్డి

శంషాబాద్, ఏప్రిల్ 3 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ షాపుల్లో ఉన్న ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ-పాస్ యంత్రాల ద్వారానే అమ్మకాలు జరుపాలన్నారు. వివిధ రకాల ఎరువులను రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని షాపుల నిర్వాహకులకు చెప్పారు. అమ్మకాల రిజిష్టర్‌తో పాటు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి కవిత ఉన్నారు.

పేందింటి ఆడబిడ్డ వివాహానికి చేయూత



సరుకులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, ఏప్రిల్ 3 : పెందింటి ఆడబిడ్డ వివాహానికి కాంగ్రెస్ నాయకులు చేయూత నిచ్చి తమ ఉదారతను చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కేతావత్ భాస్కర్ కూతురు సోని వివాహం నేడు (గురువారం) జరుగబోతోంది. కాగా ఆ వివాహానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు బీస కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భాస్కర్ కుటుంబానికి రూ. 10వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో పోగుల భీమయ్య, లాలమోని చంద్రయ్య, గుత్తి చంద్రయ్య, నిరంజన్, శీనయ్య, శేఖర్, నర్సింలు, లింగం, సేవ్య, జాన్య, రవి, నరేష్, కేతావత్ రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆమనగల్లు : మండల పరిధిలోని శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం ఉదారం చాటుకున్నారు. బుధవారం గ్రామానికి చెందిన మాడ్గుల అమృత కృష్ణయ్య దంపతుల కూతురు మౌనిక వివాహం జరుగగా గోదాదేవిసత్యం నతనవధూవరులను ఆశీర్వదించి పెళ్లికానుకగా రూ.10,116 అందజేశారు. శెట్టిపల్లి గ్రామంలో ఏ ఇంట ఆడబిడ్డ పెళ్లి జరిగినా ఐదేళ్లుగా గోదాదేవిసత్యం రూ.10,116 సాయమందిస్తున్నారు. ఇప్పటి వరకు 82మందికి చేయూతనందించారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు సాయమందిస్తున్న గోదాదేవి సత్యంను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సింగిని శ్రీనివాస్, కొప్పుల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.